# సాక్షి

## డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025






### ...పుట్టింటి సంబరాలు

తలుపులమ్మ అమ్మవారి పుట్టింటి సంబరాలు ఆదివారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకూ జరగనున్నాయి. దీనికి లోవ దేవస్థానం ఆధ్వర్యాన భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.


8లో



### అక్క బంగారం కాజేసి కటకటాలకు

సొంత అక్క బంగారం పైనే చెల్లెలు కన్నేసింది. అదును చూసి ఇద్దరి సాయంతో వాటిని అపహరించి చివరకు కటకటాల పాలైంది.

### డెల్టాలకు 7,900 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 7,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,900, మధ్య డెల్టాకు 1,300, పశ్చిమ డెల్టాకు 4,700 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.85 అడుగులు ఉంది.

## న్యూస్‌రీల్

### ఈ–శ్రమ్‌లో నమోదుకు ప్రత్యేక డ్రైవ్

అమలాపురం రూరల్: అసంఘటిత కార్మికులు ఈ నెల 17 వరకు ఈ–శ్రమ్‌లో నమోదయ్యేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్టు కార్మికశాఖ సహాయ కార్మిక కమిషనర్ టి.నాగలక్ష్మి తెలిపారు. శ్రామిక శక్తిని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అతి పెద్ద పోర్టల్ ఈ శ్రమ్ అని ఆమె అన్నారు. రిజిస్ట్రేషన్ నుంచి గుర్తింపు వరకు సంక్షేమ పథకాలు, ప్రయోజనాలను అందించడానికి ఈ పోర్టల్ వీలు కల్పిస్తుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా, ఈ–శ్రమ్ పోర్టల్ కార్మికులు సామాజిక భద్రత, ఉద్యోగ అవకాశాలు, ఆర్థిక చేరికను పొందేలా కార్మిక వ్యవస్థను పెంపొందిస్తోందన్నారు. స్వీయ–నమోదు సౌలభ్యం లబ్ధిదారులకు అందుబాటులో ఉందని ఆమె అన్నారు. కార్పొరేట్ కంపెనీల రాకతో అమెజాన్, ఫ్లిప్ కార్ట్, జొమాటో, కాసిడో, ఓలా, బిగ్ బాస్కెట్ లాంటి సంస్థల్లో పని చేసే కార్మికులకు వేదికగా, వారికి గుర్తింపు కార్డులు పొందేలా కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. తద్వారా పలు సంక్షేమ పథకాలకు వీరు అర్హులవుతారన్నారు. ఆహార, రవాణా, డెలివరీ, కొరియర్ సేవలు అందించేవారు అసంఘటిత కార్మికులుగా పరిగణించబడతారన్నారు. ఇలాంటి వారు కోనసీమ జిల్లా పరిసర ప్రాంతాల్లో వీరు అవసరం మేరకు పని చేయడం, లేకపోతే పనికి దూరంగా ఉండడం చేస్తుంటారన్నారు. ఆయా సంస్థలు వీరిని యాక్టివ్, ఇనాక్టివ్ వర్కర్స్‌గా పరిగణిస్తుంటారన్నారు. అసంఘటితంగా పనిచేసే వీరంతా ఈ–శ్రమ్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 6 నుంచి 59 ఏళ్ల మధ్యలో వయసువారు అర్హులన్నారు.

### పోలేరమ్మ జాతరలో ఘర్షణ

- బ్లేడ్లతో ఇరు వర్గాల దాడి
- ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన సెనగనపూడి దిలీప్‌కుమార్



కొసంపూడి పృథ్వీరాజ్


రావులపాలెం: పోలేరమ్మ జాతరలో డీజే సాంగ్స్ విషయంలో ఇరు వర్గాల మధ్య తలెత్తిన ఘర్షణలో ఒక వర్గానికి చెందిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రావులపాలెం పొడగట్లపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు జాతరలో భాగంగా ఊరేగింపులో డీజే సాంగ్స్ విషయంలో ఓ వర్గానికి చెందిన సరిపెల్ల కిరణ్‌బాబు, కొల్లి దిలీప్, పులిదిండి వంశీ, రొక్కాల నాగరాజు, కొల్లి ప్రవీణ్, మరో యువకుడు డిమాండ్ చేశారు. జాతర మీ ప్రాంతానికి వచ్చినప్పుడు మీకు కావాల్సిన సాంగ్స్ పెడతామని సెనగనపూడి దిలీప్‌కుమార్, కొసంపూడి జ్యోతి శివ సాయి ప్రకాష్ పృథ్వీరాజ్‌లు చెప్పడంతో వారి మధ్య ఘర్షణ దిగి బ్లేడ్లతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో దిలీప్ కుమార్, సాయిప్రకాష్ పృథ్వీరాజ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు వారిని కొత్తపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు ఇచ్చిన ఫిర్యాదుపై ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాయుడు రాము శనివారం తెలిపారు.

## వైఎస్సార్ సీపీలో ‘తూర్పు’నకు అగ్రాసనం

- పీఏసీలో కీలక ప్రాతినిధ్యం
- నియామకాల్లో సామాజిక సమతూకం
- బోస్, తోట, విశ్వరూప్, ముద్రగడకు చోటు




పిల్లి సుభాష్‌చంద్రబోస్



తోట త్రిమూర్తులు



పినిపే విశ్వరూప్



ముద్రగడ పద్మనాభం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వైఎస్సార్ సీపీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ అధిష్టానం పలు కీలక నియామకాలు చేపట్టింది. మండల, గ్రామ స్థాయిలో నూతన కమిటీల నియామకాల్లో పాత, కొత్త నేతల కలయికతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపుతోంది. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీలో అత్యున్నతమైన పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ)లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు అధిష్టానం అగ్రాసనం వేసింది. పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి కన్వీనర్‌గా వ్యవహరించే ఈ కమిటీలో ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు ప్రముఖులకు ప్రాతినిధ్యం కల్పిస్తూ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. సామాజిక సమతూకాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నియామకాలు చేపట్టారు. పీఏసీ సభ్యులుగా రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ, మండపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట త్రిమూర్తులు, అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభాన్ని నియమించారు.

## వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా జగ్గిరెడ్డి

- పార్లమెంట్ సమన్వయకర్తగా పినిపే విశ్వరూప్
- అమలాపురం అసెంబ్లీ సమన్వయకర్తగా శ్రీకాంత్



చిర్ల జగ్గిరెడ్డి



పినిపే శ్రీకాంత్

సాక్షి, అమలాపురం: అట్టడుగు స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే దిశగా వైఎస్సార్ సీపీ చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా జిల్లాకు చెందిన సీనియర్లకు కీలక బాధ్యత అప్పగించింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని నియమించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఈ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఇంత వరకు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి పినిపే విశ్వరూప్‌ను అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా విశ్వరూప్ తనయుడు, యువ నాయకుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్‌ను నియమించారు. ఈ నియామకాల పట్ల జిల్లాలో పార్టీ కేడర్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ మరింత బలోపేతం అవుతుందని, పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఇంటర్ ఫలితాల్లో కోనసీమ @ 19

- గత ఏడాది కంటే తగ్గిన స్థానం
- ఫస్టియర్ 63, సెకండియర్ 78 శాతం ఉత్తీర్ణత
- నేటి నుంచి 22 వరకు రీ వెరిఫికేషన్
- మే 12 నుంచి 20 వరకు సప్లిమెంటరీ పరీక్షలు



రాయవరంలో అధ్యాపకులతో కలిసి సెల్‌లో ఫలితాలు చూస్తున్న విద్యార్థులు

రాయవరం: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో బాలికలు మెరుగైన ఉత్తీర్ణతను సాధించారు. ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ ఫలితాల్లో బాలికల హవా కనిపించింది. మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన ఇంటర్మీడియెట్ ఫస్టియర్, సెకండియర్, జనరల్, ఒకేషనల్ ఫలితాలన్నీ శనివారం ఒకేసారి విడుదల చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఫస్టియర్ ఫలితాల్లో 63 శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 78 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ ఫలితాల్లో జిల్లా రాష్ట్ర స్థాయి ఫలితాల్లో 16వ స్థానం, సెకండియర్ ఫలితాల్లో 19వ స్థానంలో నిలిచింది. మేలో జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు ఈ నెల 15వ తేదీ నుంచి 24 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. ప్రథమ సంవత్సరంలో అన్ని సబ్జెక్టులలో ఉత్తీర్ణులై, కొన్ని సబ్జెక్టులలో మార్కులు తక్కువ వచ్చినట్టయితే ఇంప్రూవ్‌మెంటు రాసుకునే అవకాశం ఉంది. ఏ కారణంగానైనా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాని విద్యార్థులు మే 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు అమలాపురంలో జరిగే ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కావచ్చునని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఫస్టియర్, సెకండియర్ పరీక్ష తప్పిన విద్యార్థులు, ఫస్టియర్ ఇంప్రూవ్‌మెంట్ రాయాలనుకునే విద్యార్థులు ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు పరీక్ష రుసుం చెల్లించవచ్చు.

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు.

**ఉత్తీర్ణత ఇలా...**

ప్రథమ సంవత్సరం జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 12,613 మంది పరీక్షలు రాయగా 7,629 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 12,825 మంది పరీక్షలు రాయగా 9,246 మంది ఉత్తీర్ణులయ్యారు.

### నిరాశ పడవద్దు

ఇంటర్ పరీక్షలు తప్పిన, మార్కులు తక్కువ వచ్చిన విద్యార్థులు మనోధైర్యం కోల్పోకుండా తిరిగి ప్రయత్నించాలి. కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు తోడుగా నిలవాలి. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు నిర్దేశిత సమయాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

– వనుము సోమశేఖరరావు, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి, అమలాపురం

## వేంకటేశునికి వైభవంగా చక్రస్నానం



గ్రామోత్సవానికి వెళ్తున్న స్వామివారు

కొత్తపేట: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఆరో రోజు శనివారం, పౌర్ణమి కలిసి రావడంతో వాడపల్లి క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి చక్రస్నానాన్ని తిలకించారు. దేవదాయ–ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, అర్చకులు, వేదపండితులు ఉదయం స్వామివారికి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మహా పూర్ణాహుతి, బాలభోగం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు చోరసంవాదం, మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ గ్రామోత్సవం నిర్వహించి గౌతమీ గోదావరి వద్ద రేవులో ఏర్పాటుచేసిన చలువ పందిరిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వైభవంగా చక్రస్నానం నిర్వహించారు. ఈఓతో పాటు ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్సై రాము ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

**వాడపల్లి క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం**

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి క్షేత్రానికి అత్యధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. స్వామివారిని అర్చకులు సుప్రభాత సేవతో మేల్కొలిపి, అభిషేకార్చనలు చేసి వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాధారణ భక్తులతో పాటు ‘ఏడు శనివారాల దీక్షతో వాడపల్లి వెంకన్న దర్శనం కోసం వచ్చిన భక్తులతో క్షేత్రం కిక్కిరిసింది. క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం 5 గంటల వరకూ స్వామివారి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళం, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ సేవల ద్వారా శనివారం దేవస్థానానికి రూ.44,24,978 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు.

## అక్షరానికి సంకెళ్లు అన్యాయం



కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న పాత్రికేయులు

- జర్నలిస్టులపై ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై గళమెత్తిన కలం వీరులు
- జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన



ఏవో విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

సాక్షి, అమలాపురం: ‘నిజాలు రాస్తే నిరంకుశంగా వ్యవహరించడం అన్యాయం. అక్షరానికి సంకెళ్లు వేయడం దారుణం. ప్రభుత్వం సాక్షి దిన పత్రికపై పెట్టిన తప్పుడు కేసులు తక్షణం ఎత్తివేయాలి’ అని నినదిస్తూ అమలాపురానికి చెందిన పాత్రికేయులు నిరసన ప్రదర్శనకు దిగారు. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డితో పాటు మరో ఆరుగురు విలేకరులపై క్రిమినల్ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ వద్ద శనివారం మీడియా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీయూడబ్ల్యూజే, ఏపీడబ్ల్యూజేఎఫ్, అమలాపురం ప్రెస్‌క్లబ్ (ప్రింట్, ఎలక్ట్రానిక్)ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సాక్షిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలని, వియ్ వాంట్ జస్టిస్ అంటూ పెద్ద పెట్టున్న నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి కె.విశ్వేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఐజేయూ సభ్యుడు ఎంఎస్‌పీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను హరించడం అన్యాయమన్నారు. ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకర ప్రసాద్, అమలాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండేపూడి సత్యనారాయణ, ఎండీ బషీర్ మాట్లాడుతూ సాక్షి ఎడిటర్, విలేకరులపై పెట్టిన కేసులు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాక్షి స్టాఫ్ రిపోర్టర్ నిమ్మకాయల సతీష్ బాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కోశాధికారి మట్టపర్తి శ్రీనివాస్, పాత్రికేయ ప్రతినిధులు కుడుపూడి సుబ్బారావు, కడలి రాజు, ఉండ్రు ప్రసాద్, అరిగెల వసంతరావు, మూర్తి, దడాల త్రిమూర్తులు, వెలుగు మూర్తి, దాసరి శ్రీనివాస్, వి.నాయుడు, పరసా సుబ్బారావు, లెనిన్, జగతా రాంబాబు, ఎస్.రాధాకృష్ణ, ఏఆర్ శ్రీనివాస్, కె.మురళీకృష్ణ, ఎస్.విజయ్‌కుమార్, పి.సతీష్, ఏసురాజు, కె.ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అతడే.. ఆ నలుగురు..

సండే స్పెషల్

- అనాథ మృతదేహాలకు స్వయంగా అంత్యక్రియలు
- ఇప్పటి వరకూ 1,153 దేహాలకు అంతిమ సంస్కారాలు

కాకినాడ క్రైం: జీవన గమనంలో మరణం చివరి మజిలీ. తమ వారంటూ లేని జీవితం ఎంత దుర్భరమో.. చరమాంకంలో దిక్కు లేని మరణం పొందడం అంతకు మించిన దయనీయమైనది. తమను పోషిస్తూ, తమ బాగోగులు అడిగే వారంటూ ఎవరూ లేని అనాథలు, ఒంటరివాళ్లమనే వేదనతో బతుకీడ్చి ప్రాణాలొదిలితే.. జీవాన్ని విడిచేసిన దేహాన్ని సొంత కుటుంబీకులే వివిధ కారణాలతో ఆమడ దూరాన వదిలేస్తే.. ఏ బంధమూ లేని ఆ వ్యక్తి మాత్రం తానున్నానంటూ ముందుకొస్తాడు. ఆఖరి మజిలీలో ఆత్మీయుడిగా, కాటికి చేర్చి కన్నబిడ్డకు మించి బాధ్యతను మోస్తాడు. ఆ దేహాన్ని తుది మజిలీకి సిద్ధం చేస్తాడు. పూడ్చడమైనా.. దహనమైనా తన చేతులతోనే చేస్తాడు. రెక్కాడితేనే కానీ డొక్కాడని ఆర్థిక దుస్థితిలోనూ మానవత్వానికి ప్రతిరూపంగా నిలిచే ఆ వ్యక్తి పేరు కూపర్ భాను అంబేడ్కర్.

**ఎవరీ అంబేడ్కర్..**

కాకినాడ ప్రతాప్ నగర్‌కు చెందిన 49 ఏళ్ల అంబేడ్కర్ నిరుపేద డ్రైవర్. భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు లోకేష్, ఆకాష్ ఉన్నారు. కొన్నేళ్ల క్రితం ఓ రాజకీయ నాయకుడి బంధువు వద్ద కారు డ్రైవర్‌గా అంబేడ్కర్ పని చేశాడు. ఓ రోజు ఇంటి సమీపంలో ఓ బిచ్చగాడు చనిపోతే మున్సిపల్ సిబ్బంది చెత్త ట్రాక్టరులో ఎక్కించడం చూసి అతడి మనసు వికలమైంది.



అనాథ మృతదేహాన్ని మోసుకెళుతూ..



బంధువులున్న వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తూ..



అనాథ వృద్ధుడి మృతదేహానికి అంతిమ సంస్కారాలు

అటువంటి చావు ఎవ్వరికీ రాకూడదని తల్లడిల్లిపోయాడు. అటువంటి వారి కోసం ఏదో ఒకటి చేయాలని సంకల్పించాడు, ఉద్యోగం మానేసి అనాథ మృతదేహాల తుది మజిలీని తన చేతులతో పూర్తి చేయాలని నిర్ణయించుకున్నాడు. దీనిపై ఆలోచన సాగిస్తూనే కుటుంబ పోషణ కోసం ఉద్యోగం చేస్తూ బతుకు బండి నడిపేవాడు.

కాకినాడలోని ఓ సంస్థలో అనాథ మృతదేహాల తరలింపునకు 2007లో ‘ఆత్మబంధు’ పేరిట ఓ వాహనం సిద్ధమైందని తెలుసుకున్న అంబేడ్కర్.. అందులో పని చేస్తానంటూ అక్కడి అధికారులను సంప్రదించాడు. తాము తగిన జీతం ఇవ్వలేమని వారు చెప్పగా.. భార్యాబిడ్డలకు అన్నం పెట్టే అంత మొత్తం చాలని, తనకు సేవాభాగ్యం కల్పించాలని కోరాడు. అంబేడ్కర్ సంకల్పం ముందు తల వంచిన ఆ సంస్థ ప్రతినిధులు అనాథ దేహాల తరలింపు వాహనానికి అంబేడ్కర్‌ను డ్రైవర్‌గా నియమించారు. ఆ తరువాత 2017లో అతడు కాకినాడకు చెందిన కండిబోయిన ధర్మరాజు నిర్వహిస్తున్న కండిబోయిన వారి శ్రీ స్వచ్ఛంద సేవా సంస్థలో చేరాడు.

అక్కడ వాహనం నడపడంతో పాటు పూర్తి స్థాయిలో అనాథ మృతదేహాలను మోసుకెళ్లడం, తరలించడం వంటి పనులు కూడా అతడికి అప్పగించారు. అది మొదలు సంస్థ ఆదర్శాలను మించి సేవా మార్గంలో అంబేడ్కర్ పయనించాడు. కుళ్లి, శరీర భాగాలు తెగిపోయిన దేహాల నుంచి, గుర్తు తెలియని మృతదేహాల వరకూ.. అందరూ ఉండి అనాథలుగా మిగిలిన దేహాల నుంచి.. ఎవరూ లేని అనాథల వరకూ స్వయంగా అతడే అంత్యక్రియలు నిర్వహించేవాడు. గతంలో అంబేడ్కర్ పని చేసిన సంస్థ అతడు లేక తమ సేవలనే నిలిపివేసిందంటే అతడి నిబద్ధత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. 2007 నుంచి ఇప్పటి వరకూ అంబేడ్కర్ మొత్తం 1,153 అనాథ మృతదేహాలను కాటికి తరలించాడు. వీరిలో తలకొరివి పెట్టినవీ ఉన్నాయి.

### కళ్లు చెమ్మగిల్లుతాయి



అనాథలు చనిపోయిన తీరు చూస్తే కళ్లు చెమ్మగిల్లుతాయి. ఇటువంటి చావు ఎందుకొచ్చిందా అని వేదన పడుతూంటాను. నా చివరి శ్వాస వరకు అనాథ మృతదేహాల సేవలోనే తరిస్తాను. అనాథ దేహం కదా అని అంతిమ సంస్కారాల్లో ఏ మాత్రం వెనకడుగు వేయను. నలుగురి సహకారంతో పూర్తి స్థాయిలో నిర్వహిస్తాను. ఎవరైనా అనాథ మృతదేహాలను గుర్తిస్తే 93478 78713, 84988 74684 నంబర్లకు ఫోన్ చేస్తే దేహాన్ని ఉచితంగా శ్మశానానికి తరలించి, అంతిమ సంస్కారాలు నిర్వహిస్తాను.

– కూపర్ భాను అంబేడ్కర్, కాకినాడ



కాకినాడ పీఆర్ కళాశాల రోడ్డు పక్కన పడి ఉన్న అనాథ శవాన్ని వస్త్రం చుట్టి తరలిస్తూ..

### పోలీసులకు తోడ్పాటు

అనాథ దేహాలు లేదా కుళ్లిన మృతదేహాలు లభ్యమైతే వాటిని పోస్టుమార్టానికి తరలించేందుకు, అనంతరం శ్మశానానికి తీసుకుని వెళ్లి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు పోలీసులు అంబేడ్కర్‌ను సంప్రదిస్తారు. పైసా ప్రయోజనం ఆశించకుండా వారికి తోడ్పాటునందిస్తాడు. తన సేవల ద్వారా అంబేడ్కర్ గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ గోపాలకృష్ణ ద్వివేది, పూర్వపు రాష్ట్ర డీజీపీ గౌతమ్ సవాంగ్ తదితరుల మన్ననలు పొందాడు. ఆయా అధికారులు అతడికి మెమెంటోలు ఇచ్చి సత్కరించారు.

### కోవిడ్ వేళ అసమాన సేవలు

కోవిడ్ వేళ అంబేడ్కర్ అసమాన సేవలు అందించాడు. వైరస్ సోకి, మృతి చెందిన వారి దేహాలు తాకడం ప్రాణాంతకమని తెలిసినా స్వయంగా భుజాలపై మోసుకుని వెళ్లి మరీ దహన సంస్కారాలు నిర్వహించాడు. అలాగే కోవిడ్ సోకి, నడిరోడ్డు పైనే చనిపోయిన వృద్ధులు, అనాథలు, బిచ్చగాళ్లకు అంత్యక్రియలు నిర్వహించాడు.

## ఈదురు గాలులతో వర్షం

కొబ్బరిచెట్టుపై పడిన పిడుగు



నాయకంపల్లిలో పిడుగుపాటుకు కాలిపోతున్న కొబ్బరిచెట్టు

**గండేపల్లి:** మండలవ్యాప్తంగా శనివారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ఎక్కువగా ఉంటడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. నాయకంపల్లిలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడి కాలిపోయింది. ఉరుములు, మెరుపులకు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు.

## బైండోవర్ కేసులు

**అమలాపురం టౌన్:** స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన 63 మందిపై బైండోవర్ నమోదు చేసినట్లు సీఐ వీటీవీవీ సత్యనారాయణ శనివారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. బెల్ట్ షాపుల నియంత్రణలో భాగంగా వీరిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. వారిని ఆయా మండలాల మెజిస్ట్రేట్‌లు, తహసీల్దార్ల ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు. అమలాపురం మండలంలో 14, అల్లవరం మండలంలో 16, అయినవిల్లి మండలంలో 13, అంబాజీపేట మండలంలో, ఉప్పలగుప్తం మండలంలో 11 మందిని బైండోవర్ చేసినట్లు సీఐ ఆ ప్రకటనలో వివరించారు.

## అంబాజీపేట కొబ్బరి మార్కెట్



| కొబ్బరి రకం | ధర (రూ.ల్లో) |
|---|---|
| కొత్తకొబ్బరి (క్వింటాల్) | 14,000 - 14,500 |
| కొత్తకొబ్బరి (రెండవ రకం) | 9,500 - 10,000 |
| కురిడీ కొబ్బరి (పాతవి) | |
| గండేరా (వెయ్యి) | 19,000 |
| గటగట (వెయ్యి) | 17,000 |
| కురిడీ కొబ్బరి (కొత్తవి) | |
| గండేరా (వెయ్యి) | 18,000 |
| గటగట (వెయ్యి) | 16,000 |
| నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి) | 13,000 - 13,500 |
| కొత్త (పచ్చి)కాయ (వెయ్యి) | 13,000 - 13,500 |
| కొబ్బరి నూనె (15 కిలోలు) | 3,750 |
| ఒక కిలో | 260 |

# నేటి నుంచి తలుపులమ్మ తల్లి పుట్టింటి సంబరాలు

- లోవ గ్రామంలో 26న జాగరణ
- 27న తీర్థం, ఊరేగింపు
- పలు గ్రామాల్లో జాతరలకు భారీ ఏర్పాట్లు

**తుని రూరల్:** తలుపులమ్మ అమ్మవారి పుట్టింటి సంబరాలు ఆదివారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకూ జరగనున్నాయి. ప్రతి సంవత్సరం గంధామావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని లోవ కొత్తూరు గ్రామంలో తలుపులమ్మ తల్లికి పుట్టింటి సంబరాలు, ఆషాఢ మాసంలో లోవ దేవస్థానం ఆవరణలో నెల రోజులు ఆషాఢ మాసోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. పుట్టింటి సంబరాల సందర్భంగా 14 రోజుల ఉత్సవాల అనంతరం అమ్మవారి ఊరేగింపు, దర్శనాలు, తీర్థం నిర్వహిస్తారు. గ్రామస్తుల అభీష్టం మేరకు లోవ దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో లోవ గ్రామంలో ఉపాలయం వద్ద నాలుగెకరాల విస్తీర్ణంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనికి అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ సాంస్కృతిక, జానపద, సాంఘిక ప్రదర్శనలు, కోలాటాలు, భజనలు, కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణలు, బాణసంచా పేలుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న స్థానికులు, వారి ఆడపడుచులు, అల్లుళ్లు, బంధుమిత్రులు లోవ కొత్తూరు వచ్చి గంధామావాస్య ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ ఉత్సవాలకు అవసరమైన ఖర్చును లోవ దేవస్థానం నుంచి భరిస్తామని ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు.



పుట్టింటి సంబరాల్లో పూజలందుకోనున్న తలుపులమ్మ తల్లి

### సంబరాలు జరుగుతాయిలా..

మొదటి రోజయిన ఆదివారం గరగల సంబరాలతో అమ్మవారి పుట్టింటి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. వివిధ గ్రామాల్లో గరగలను ప్రదర్శిస్తూ విస్తృత ప్రచారం నిర్వహిస్తారు. 26వ తేదీ రాత్రి జాగరణ, 27న అమ్మవారి ఊరేగింపు, దర్శనాలు, తీర్థంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ నెల 26న 50 మంది నాట్య కళాకారులచే సాంస్కృతిక ప్రదర్శనలు, కేరళ లేడీ డ్రమ్స్ టీమ్, కాంతార లైటింగ్ డ్యాన్స్ టీమ్, గోపాల గోపాల ప్రోగ్రాం, పెద్ద ఆంజనేయ బృందాలతో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. 27న వివిధ వాహనాలపై బళ్ల వేషాలు, నక్కపల్లి వారి మ్యూజికల్ బ్యాండ్, 60 మంది నాట్య కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



లోవకొత్తూరులోని అమ్మవారి ఆలయ ముఖ మండపం

### వివిధ గ్రామాల్లో..

లోవ దేవస్థానం పరిసర ప్రాంతవాసులకు తలుపులమ్మ తల్లి ఇలవేల్పు కావడంతో గంధామావాస్య రోజున వివిధ గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించనున్నారు. వి.కొత్తూరు, కొత్త వెలంపేట, సీతయ్యపేట, మర్లపాడు, రాజుపేట, జగన్నాథగిరి, గెడ్లబీడు, వెలంపేట కాలనీ, తాళ్లూరు, కుమ్మరిలోవ తదితర గ్రామాల్లో వేర్వేరుగా తలుపులమ్మ తల్లి జాతర భారీగా నిర్వహిస్తారు. దీని కోసం ఆయా గ్రామ కమిటీల ఆధ్వర్యాన భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ ప్రదర్శనల్లో వెండి తెర, బుల్లి తెర నటీనటులు పాల్గొని ఆయా గ్రామస్తులను అలరించనున్నారు.

# రంకెలేసి.. రయ్యిన దూకి..

- ఉత్సాహంగా రాష్ట్రస్థాయి ఎడ్లబళ్ల పోటీలు
- భారీగా వచ్చిన జనంతో చేబ్రోలు కిటకిట

**పిఠాపురం:** గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పందాలలో ఎడ్లు రంకెలెత్తగా యువతలో ఉత్సాహం ఉరకలెత్తింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల నుంచి సుమారు 30 ఎడ్ల జతలు పందెంలో పాల్గొనగా ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పందేలు నిర్వహించారు. సీనియర్ విభాగంలో 6 జతల ఎడ్లు పాల్గొనగా, జూనియర్స్ విభాగంలో 24 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. పందేలను తిలకించడానికి జనం భారీగా తరలి రావడంతో చేబ్రోలు పుంత మార్గం జనంతో కిటకిటలాడింది. సీనియర్ విభాగంలో ఎడ్లు కిలోమీటరున్నర పరుగు పెట్టగా జూనియర్ విభాగంలో ఎడ్లు కిలో మీటరు పరుగు పెట్టాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శుక్రవారం గుర్రాల పందాలు, శనివారం ఎడ్ల పరుగు పందాలు ముగిసాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా ఏటా ఎడ్ల పరుగు పందాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు. జూనియర్స్ విభాగంలో వడిసలేరుకు చెందిన సిద్ధి వినాయక ధరణి శ్రీనివాస్, హైదరాబాద్‌కు చెందిన కె.సతీష్, గొల్లప్రోలుకు చెందిన నిమ్మకాయల నూకరాజు, వన్నెపూడికి చెందిన బవిరిశెట్టి మణి వరుసగా మొదటి నాలుగు బహుమతులు కైవసం చేసుకున్నారు. సీనియర్స్ విభాగంలో కొవ్వాడకు చెందిన మట్టా నవనీత మొదటి బహుమతి గెలుచుకున్నారు.



పందెంలో దూసుకుపోతున్న ఎడ్లు

## ఇంటర్ ఫలితాలలో
# తిరుమల ప్రభంజనం

**రాజమహేంద్రవరం రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రథమ, ద్వితీయ సంవత్సర ఇంటర్ ఫలితాలలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470కి 467 మార్కులను యు.విరోనిక, ఎం.హర్షిత, ఎస్.తేజ, జి.రాజనీవ న్‌తేజ, ఎ.వీరవెంకట సాయిలిఖి సాధించారని, 466 పైన 31మంది, 464పైన 369 మంది, 460పైన 1086 మంది, 450 పైన ప్రతి ఇద్దరిలో ఒకరికి అనగా 2133 మంది సాధించారని, అలాగే 99.20 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. బైపీసీ విభాగంలో 440కి 436 మార్కులను 11 మంది విద్యార్థులు కె.సుప్రియ, ఎ.శ్రీరామ తేజశ్విని, సీహెచ్ నేహా గ్రేస్, జి.మోహనరూప, జె.భవిత, కె.గాయత్రి, టి.సరయు, బి.యశస్విని, షేక్ షమీన, ఆర్.వీరగంగ నాగేంద్ర, పి.ప్రణవ్ సాయిగణేష్ సాధించారని, 435పైన 32 మంది, 433 పైన 91మంది, 430 పైన 167 మంది, 400 పైగా మార్కులు 463 మంది సాధించారని, అలాగే 99.47 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు.

సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు ఏడుగురు విద్యార్థులు ఎం.ప్రియహాసిని, సీహెచ్ హరిసూర్య, పి.పవిత్ర, కె.మానస, ఎం.లేఖన, ఎస్.సాయిలిఖిత, పి.ధాత్రికావ్యశ్రీ సాధించారని, 23 మంది విద్యార్థులకు 990 మార్కులు, 331 మంది విద్యార్థులకు 985 మార్కుల పైన, 791 మంది విద్యార్థులకు 980 మార్కుల పైన, 2151 మంది విద్యార్థులకు 950 మార్కులపైన సాధించారని, 99.98 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. బైపీసీ విభాగంలో 1000 మార్కులకు షేక్ ఫాతిముస్నీసా బేగం 991 మార్కులు, పి.నాగవైష్ణవి, సీహెచ్‌వీడీ రేణుక, ఎస్.వైష్ణవి, బి.హర్షిత, ఎస్.మణి, జి.రితిక 990 మార్కులు సాధించారని, 108 మంది విద్యార్థులు 980 పైన, 204 మంది విద్యార్థులు 970 పైన, 297 మంది విద్యార్థులు 950 మార్కులపైన సాధించారని, అలాగే 100 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, విద్యాసంస్థల టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.



సీనియర్ ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో అకడమిక్ డైరెక్టర్ సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరి

# అక్క బంగారం కాజేసి కటకటాలకు

- పెద్దమ్మ కూతురితో కలసి చోరీ చేసిన చెల్లి
- కట్టర్ సాయంతో తాళాలు తొలగించిన వైనం
- 198 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు, ఇంటి డాక్యుమెంట్ల స్వాధీనం

**నిడదవోలు :** సొంత అక్క బంగారంపైనే చెల్లెలు కన్నేసింది. అదును చూసి ఇద్దరి సాయంతో వాటిని అపహరించి చివరకు కటకటాల పాలైంది. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ శనివారం స్థానిక విలేకరులకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఎంవీ నగర్‌లో బలిజ సత్యనారాయణ, శశి లలితాదేవి దంపతులు నివసిస్తున్నారు. లలితాదేవి పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆమె సొంత చెల్లెలు పడాల లక్ష్మీశైలజ తాడేపల్లిగూడెంలో ఉంటోంది. శైలజ ఆర్థిక పరిస్థితుల వల్ల తన అక్క బంగారం దొంగిలించి తన ఆర్థిక అవసరాలను తీర్చుకోవాలని పథకం వేసింది. ఈ మేరకు ఉండ్రాజవరం గ్రామానికి చెందిన తన పెద్దమ్మ కుమార్తె బండి సత్యవేణి సహాయం తీసుకుంది. ఆమెకు ఈ పథకం గురించి చెప్పింది. బీరువా తాళాలు బద్దలు కొట్టడానికి ఓ వ్యక్తిని పురమయించాలని చెప్పింది. ఆమె ఉండ్రాజవరం గ్రామానికి చెందిన కప్పకాయల సురేంద్రను తీసుకుని ఆటోలో ఈ నెల పదో తేదీ మధ్యాహ్నం 12:30 గంటలకు లలితాదేవి ఇంటికి చేరుకున్నారు. వారు ముగ్గురు ఇంటి చుట్టుపక్కల రెక్కీ నిర్వహించి, ఎవరైనా వస్తే చెప్పాలని సత్యవేణిని ఆటో వద్ద కాపలా ఉంచారు. తర్వాత నిందితులు శైలజ, సురేంద్ర కలిసి ఇంటికి వేసిన తాళాన్ని ఐరన్ కట్టర్‌తో కట్ చేసి లోపలికి ప్రవేశించారు. గదిలో ఉన్న బీరువా లాకర్‌ను కూడా కట్టర్ సహాయంతో కట్ చేసి బీరువాలోని 198 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 వేలు, ఇంటి, ఖాళీ స్థలం డాక్యుమెంట్లు అపహరించుకుపోయారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు పట్టణంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించారు. పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించగా శైలజ, సత్యవేణి, సురేంద్రల నేరం చేసినట్టు ఒప్పుకోవడంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తిలక్ పేర్కొన్నారు. వీరి నుంచి 198 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. బంగారు ఆభరణాలు, డాక్యుమెంట్ల విలువ రూ.12.55 లక్షలు ఉంటుందన్నారు. అతి తక్కువ సమయంలో ముద్దాయిలను గుర్తించి కేసులు ఛేదించిన ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు, సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అభినందించి వారికి రివార్డులు ప్రకటించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న నిడదవోలు సీఐ పీవీజీ తిలక్



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, నగదు



# ఇంటర్‌లో శ్రీ షిర్డీ సాయి విజయ బావుటా

**కంబాలచెరువు:** ఇంటర్మీడియెట్ మొదటి, రెండో సంవత్సరం ఫలితాల్లో శ్రీ షిర్డీ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో విజయ బావుటా ఎగుర వేశారు. ఆ వివరాలను విద్యా సంస్థల డెరెక్టర్ టి. శ్రీవిద్య శుక్రవారం విలేకర్లకు వెల్లడించారు.

ప్రథమ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీలో 470 మార్కులకు 465 మార్కులతో జి. మెహెర్ సత్య ప్రసాద్, ఎం.అభినవ్ వివేక్ ప్రథమ స్థానంలో నిలవగా, 464 మార్కులతో ఎన్‌వీపీ వర్షిత్, ఎం.తను శ్రావ్య శ్రీ, వై.బ్లెస్సీ ద్వితీయ స్థానాన్ని, 463 మార్కులతో బి.సాయి ప్రకాష్, కె.తేజస్విని, ఎస్.నిత్యశ్రీ, పి.భద్ర సాహితి, ఎస్.లలిత, ఆర్. హాజీరా తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బైపీసీలో 440 మార్కులకు 428 మార్కులతో ఎస్.తేజశ్రీ, ప్రథమ స్థానాన్ని, 416 మార్కులతో డి.దేవిసాయి ద్వితీయ స్థానాన్ని సాధించారు. మొత్తం 16 మంది విద్యార్థులు 460 పైగా మార్కులు సాధించగా, 63 మంది 450 పైగా, 153 మంది 420కి పైగా, 207 మంది 400కి పైగా సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీలో వి.మణికంఠ 990 మార్కులతో ప్రథమ, ఎం.హాసిని, ఎస్.నందిని, వి.శివ కేశవ, జి.సాయి ముఖేష్ 987 మార్కులతో ద్వితీయస్థానాన్ని, ఎ.దివ్య 986 మార్కులతో తృతీయ స్థానాన్ని సాధించారు.

బైపీసీలో 976 మార్కులతో కె.హిమశ్రీ ప్రథమస్థానాన్ని 974 మార్కులతో, కె.శిరీష ద్వితీయస్థానాన్ని సాధించారు. 13 మంది 980కి పైగా మార్కులు సాధించగా, 53 మంది 970కి పైగా, 107 మంది 950కి పైగా, 125 మంది 920కి పైగా, 203 మంది 900కి పైగా మార్కులు సాధించారని శ్రీవిద్య వివరించారు. ఈ విజయంపై విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని అభినందించారు.



విద్యార్థులతో శ్రీ షిర్డీ సాయి అధ్యాపకులు

# చివరి మజిలీ సౌకర్యంగా..

- కొత్తపేటలో కైలాసభూమి కార్యరూపం
- రూ.3 కోట్లతో ఎట్టకేలకు పూర్తి
- నెరవేరిన నంబూరి రెడ్డియ్య కల
- ఘనంగా ప్రారంభం

**కొత్తపేట:** అంతిమ సంస్కారాలకు అధునాతన సౌకర్యాలతో కైలాస భూమి కొత్తపేట పరిసర గ్రామల ప్రజలకు సమకూరింది. స్థానిక బోడిపాలెం వంతెన సమీపంలోని సూర్యగుండాల రేవు ప్రాంతంలో లయన్స్ క్లబ్ కైలాసభూమి ఎట్టకేలకు నిర్మితమైంది. ప్రముఖ వ్యాపారవేత్త, కేబుల్ నెట్‌వర్క్ అధినేత, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నంభూరి వీరవెంకట సత్య సూర్య రెడ్డియ్య 20 ఏళ్ల నాటి ఆలోచనకు 13 ఏళ్లనాడు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో కార్యరూపం దాల్చి ఎట్టకేలకు రూ.3 కోట్ల వ్యయంతో ఎట్టకేలకు నిర్మితమై శనివారం ప్రారంభమైంది.

### ఘనంగా ప్రారంభోత్సవం

లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నంభూరి రెడ్డియ్య ఆధ్వర్యంలో ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఈ కైలాసభూమిని ప్రారంభించారు. వివిధ విభాగాలను లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈవీవీ ఈశ్వరకుమార్, మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ, కైలాసభూమి నిర్మాణ పర్యవేక్షకుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు, రాష్ట్ర టీడీపీ నాయకుడు ఆకుల రామకృష్ణ, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం తదితరులు ప్రారంభించారు.

### నాడు కల నేటికి సాకారం

2012వ సంవత్సరంలో స్థానిక లయన్స్ క్లబ్ ఏర్పాటుకు జరిగిన సమావేశంలో నంబూరి రెడ్డియ్య ఈ కైలాసభూమి ఆవశ్యకతను ప్రస్తావించారు. ఆయన ప్రెసిడెంట్‌గా క్లబ్ ఏర్పాటు కాగా కాలక్రమంలో కైలాసభూమి నిర్మాణంపై దృష్టిపెట్టారు. పవిత్ర సూర్యగుండాలపాయకు చేర్చి రూ.12 లక్షలతో 1.50 ఎకరాలు భూమిని కొనుగోలు చేశారు. రెడ్డియ్య వ్యక్తిగతంగా రూ.1.80 కోట్లు వెచ్చించారు. మిగిలిన మొత్తాన్ని దాతల నుంచి సేకరించారు. ఉపాధి నిధులు రూ.40 లక్షలతో కైలాసభూమి వరకు సీసీ రోడ్డు, మిగిలిన పనులకు పలు చోట్ల నిధులు సేకరించారు. ఈ నిధులతో ఒక అంతస్తుతో కూడిన భవనం (మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్ విభాగం, అస్తికల లాకర్ల విభాగం, కార్యాలయం, సంతాప సభ కోసం హాలు సముదాయం), నాలుగు బెర్తులతో శవ దహనవాటిక, మృతదేహంతో ప్రదక్షిణ చేసే ఓం నమఃశివాలయ షెడ్డు, మృతుని బంధువుల వెయిటింగ్ భవనం, శివుని విగ్రహం, 24 ట్యాప్‌లతో జల్లు స్నానం పైపులైన్, పార్కు నిర్మాణం పూర్తిచేశారు. ఇంకా కలప షెడ్డు నిర్మాణం పూర్తికావాల్సివుంది.



కొత్తపేట కైలాసభూమి



కైలాసభూమిలో ఒక విభాగాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ గవర్నర్ ఈశ్వరకుమార్

### నాడు పెద్దల అంత్యక్రియల్లో పుట్టిన ఆలోచన



2004 అక్టోబర్ 18న నా తండ్రి నంబూరి వీర్రాజు (సిద్ధాంతి) చనిపోయినప్పుడు ఇక్కడ అంత్యక్రియలు నిర్వహించాం. అప్పుడే ఈ శ్మశానానికి వచ్చాను. ఏ సౌకర్యాలు లేక చాలా దుర్భరంగా ఉంది. 2005 జూన్‌లో రాజమహేంద్రవరంలో మా మావయ్య వాకచర్ల బంగారయ్య మృతి చెందగా అక్కడ రోటరీ కైలాసభూమిలో అన్ని సౌకర్యాల నడుమ అంత్యక్రియలు నిర్వహించాం. అటువంటి కైలాసభూమిని కొత్తపేటలో నిర్మించాలని సంకల్పించి ఎట్టకేలకు పూర్తిచేసి ప్రారంభించాం. చాలా సంతృప్తిగా, ఆనందంగా ఉంది.

– నంభూరి వీవీఎస్ఎస్ రెడ్డియ్య, కైలాసభూమి నిర్మాత, కొత్తపేట